ఆగిన ఆధునికీకరణ పనులు

- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని రైల్వే అధికారులు


అర్ధంతరంగా నిలిచిపోయిన ఆర్చ్ పనులు

తాడిపత్రి రూరల్: తాడిపత్రి రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. వివరాలు.. అమృత్ పథకం కింద తాడిపత్రి రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం దాదాపు 11 కోట్లు కేటాయించారు. నిధులు మంజూరై ఏడాది కావస్తోంది. రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పేరుతో చేపట్టిన పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. నిధుల కొరత, చేసిన పనులకు బిల్లుల మంజూరులో జాప్యం కారణంగా కాంట్రాక్టర్లు ఎక్కడి పనులను అక్కడే నిలిపివేశారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్య వైఖరి కారణంగా రోజూ వందలాది మంది ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రైల్వేస్టేషన్ ఆధునికీకరణలో భాగంగా ఎంట్రన్స్‌లో అర్చ్ ఏర్పాటు కోసం సిమెంట్ రోడ్డును అధికారులు బ్లాక్ చేశారు. నాలుగు నెలలు గడుస్తున్నా ఆర్చ్ పనులు పూర్తి కాలేదు. వాహనాల రాకపోకల కోసం తాత్కాలికంగా పక్కన మట్టి రోడ్డును ఏర్పాటు చేశారు. వాహనాల రాకపోకల సంఖ్య ఎక్కువగా ఉండటంతో దుమ్మూ, ధూళి రేగుతోంది. చిన్న పాటి వర్షం వచ్చినారోడ్డు బురదమయం అవుతోంది. వారం రోజుల్లో దాదాపు 30 మంది ద్విచక్ర వాహనదారులు రోడ్డుపై జారిపడ్డారు. నాలుగు రోజుల క్రితం సుబ్రమణ్యం అనే వ్యక్తి భార్యతో పాటు అత్తను ద్విచక్ర వాహనంలో రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయత్నంలో రోడ్డుపై జారి పడ్డారు. దీంతో అతని కాలికి గాయమై నడవలేని స్థితిలో స్టాండ్‌లో ద్విచక్ర వాహనం పెట్టి రైలు ఎక్కాల్సి వచ్చింది. ఈ సంఘటన జరిగిన రెండు గంటల తరువాత సలీం అనే ప్రయాణికుడు భార్య, కూతురితో కలిసి రైల్వే స్టేషన్‌కు వస్తుండగా బురదగా ఉన్న రోడ్డుపై జారి పడ్డారు. వారికి దెబ్బలు తగలక పోయినా దుస్తులన్నీ బురదమయమయ్యాయి.. అయినా అలాగే రైలు ఎక్కాడు. ఇలా చెప్పుకుంటూ పోతే వర్షం పడినపుడు ద్విచక్ర వాహన ప్రయాణికులు పడి లేస్తూ కనిపిస్తూ ఉంటారు.

ప్రయాణికుల వెయిటింగ్ హాలుకు తాళం

అధికారులు పనుల పునరుద్ధరణ పేరుతో ప్రయాణికులు కూర్చొనేందుకు ఏర్పాటు చేసిన వెయిటింగ్ హాలును మూసివేసి తాళం వేశారు. ప్రారంభంలో పనులు కొద్దిగా చేసి తరువాత నిలిపివేశారు. ప్రస్తుతం ప్రయాణికులు ప్లాట్‌ఫారంపై సేద తీరాల్సి వస్తోంది. తాడిపత్రి రైల్వే స్టేషన్‌లో రాత్రి సమయంలో రైలు దిగిన ప్రయాణికులు ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి సరైన ప్రయాణ సౌకర్యాలు లేకపోవడంతో ఉదయం వరకు రైల్వే స్టేషన్‌లో నిద్రిస్తున్నారు. వీరంతా దోమలు, చలికి ఇబ్బందులు పడుతున్నారు.

గోతులు తవ్వి వదిలి వేశారు

రైల్వే స్టేషన్ ముందు భాగంలో 15 అడుగల లోతు వరకు రెండు పెద్ద గోతులు తవ్వారు. ఎందుకు తవ్వారో అధికారులు కూడా సమాధానం చెప్పడం లేదు. నెలల తరబడి తీసిన గోతులను పూడ్చకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదకరంగా ఉన్న గోతుల చుట్టూ ఏర్పాటు చేసిన హెచ్చరిక స్టాండ్‌లు సైతం అక్కడక్కడ పడిపోయాయి. వర్షం నీటితోపాటు బాత్ రూముల నుంచి వచ్చే మురికి నీరు గోతుల్లో చేరి దుర్వాసనను వెదజల్లుతోంది.


ప్రమాదకరంగా ఉన్న గొయ్యి


మూసివేసిన వెయిటింగ్ హాలు

వాహనదారులు జారి పడుతున్నారు



రైల్వే స్టేషన్ సమీపంలోని మట్టిరోడ్డుపై ద్విచక్ర వాహనదారులు జారీ పడుతున్నారు. వర్షం వస్తే రోడ్డు బురదగా మారుతోంది. వాహనాల్లో వెళ్లే ప్రయాణికులు అదుపు తప్పి కింద పడుతున్నారు. నెలల తరబడి సిమెంట్ రోడ్డును పునరుద్ధరించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

– విజయ్, ప్రయాణికుడు, తాడిపత్రి

చర్యలు తీసుకుంటాం



రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. పనుల వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని పలువురు ప్రయాణికులు తన దృష్టికి తీసుకువచ్చారు. ప్రయాణికులు ఇబ్బందులు పడకుండ చర్యలు తీసుకుంటాం. పనులు త్వరగా పూర్తయ్యేలా చూస్తాం.

– అనిల్ కుమార్, స్టేషన్ మాస్టర్, తాడిపత్రి

క్లుప్తంగా

15న కంటి వైద్య శిబిరం

పామిడి: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి కల్యాణమండపంలో ఈనెల 15న పామిడి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బెంగుళూరు శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ సీనియర్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడు మంగళవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ కంటి వైద్య నిపుణులచే ఉచిత పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామన్నారు. శిబిరానికి వచ్చేవారు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో పాటు మూడు పాస్‌ఫొటోలు, సెల్‌ఫోన్ తీసుకురావాలన్నారు. అవకాశాన్ని మండల, మండలేతర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదనపు సమాచారం కోసం 9440550000, 9866589899 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నిమ్మ చెట్ల నరికివేత


కొట్టేసిన నిమ్మ చెట్లను పరిశీలిస్తున్న ఎస్‌ఐ వెంకటరమణ

యాడికి: మండలంలోని కత్తిమానుపల్లిలో రైతు శివరామి రెడ్డి పొలంలో గుర్తు తెలియని దుండగులు మంగళవారం తెల్లవారుజామున 14 నిమ్మ చెట్లు నరకడమే కాకుండా డ్రిప్ పైపులను తగలబెట్టారు. దీంతో రూ.50 వేల వరకూ నష్టం వచ్చిందని బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే ఎస్‌ఐ వెంకటరమణ తన సిబ్బందితో కత్తిమానుపల్లికి వెళ్లి పొలాన్ని పరిశీలించారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రభుత్వాస్పత్రిలో ప్రసవం సురక్షితం


మాట్లాడుతున్న వైద్యురాలు ప్రీతి

పెద్దపప్పూరు: ప్రభుత్వాస్పత్రిలో ప్రసవం సురక్షితమని వైద్యురాలు ప్రీతి సూచించారు. మంగళవారం పామి స్థానిక పీహెచ్‌సీలో ఆశా, ఆరోగ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అమె మాట్లాడుతూ ఎటువంటి ఆరోగ్య సమస్యలున్నా తక్షణమే సమీపంలోని ప్రభుత్వాస్పత్రిలో సంప్రదించాని గ్రామస్తులకు తెలియజేయాల్సిన బాధ్యత ఆశా, ఆరోగ్య కార్యకర్తలదే అన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శర్మాస్‌వలి తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో అరుదైన శస్త్ర చికిత్స

గుత్తి: గుత్తిలోని ప్రజా వైద్య శాలలో వైద్యుల బృందం మంగళవారం అరుదైన శస్త్ర చికిత్స (ఆపరేషన్) చేశారు. ఓ మహిళ కడుపులోని రెండు కిలోల గడ్డను తొలగించారు. వివరాల్లోకి వెళితే.. గుత్తి మండలం అబ్బేదొడ్డి గ్రామానికి చెందిన బలిజ లక్ష్మి కొంత కాలంగా విపరీతమైన కడుపు నొప్పితో బాధపడుతుండేది. అనేక ఆసుపత్రుల్లో వైద్యం చేయించారు. అయినప్పటికీ నయం కాలేదు. ఈ క్రమంలో గత కొన్ని రోజుల క్రితం ప్రజా వైద్య శాలను సంప్రదించారు. పీఆర్‌ఓ ఇస్మాయిల్ సూచనల మేరకు డాక్టర్ బ్రహ్మారెడ్డి వైద్య బృందం సభ్యులు లక్ష్మికి పలు రకాల వైద్య పరీక్షలు చేసి కడుపులో గడ్డ ఉన్నట్లు గుర్తించారు. మంగళవారం వైద్య బృందం ఆపరేషన్ చేసి రెండు కిలోల గడ్డను తొలగించారు. అరుదైన ఆపరేషన్ చేసి గడ్డను తొలగించిన వైద్య బృందానికి రోగి లక్ష్మి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడా మైదానంలోకి మురుగు


రైల్వే ఇన్‌స్టిట్యూట్ క్రీడా మైదానంలోకి చేరిన మురుగునీరు, వర్షం నీరు

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ క్రీడా మైదానంలో మురుగు నిల్వ ఉండడంతో క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. క్రీడామైదానంలో పక్కన ఉన్న డ్రైనేజీ కాలువ అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగునీరంతా క్రీడామైదానంలోకి ప్రవేశిస్తోంది. క్రీడామైదానం చిత్తడిగా, అధ్వానంగా, అపరిశుభ్రంగా మారిపోయింది. అక్కడే క్రికెట్ ప్రాక్టిస్ బాక్సు కూడా ఉంది. దాంట్లోకి కూడా వర్షం నీరు, మురుగు నీరు చేరింది. దీంతో క్రికెట్ ప్రాక్టిస్ కూడా నిలిచిపోయింది. ఇప్పటికైనా సంబంధిత రైల్వే అధికారులు స్పందించి క్రీడామైదానంలోకి మురుగు నీరు, వర్షపు నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని క్రీడాకారులు కోరుతున్నారు.

పేదలకు ఇల్లు నిర్మించి ఇవ్వాలి


తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ కార్యకర్తలు

గుత్తి: అర్హత ఉన్న పేదలందరికీ ఇంటి స్థలాలిచ్చి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. గుత్తిలో సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం ఇంటి స్థలాల కోసం ర్యాలీ, ధర్నా కార్యక్రమాలు నిర్వహించారు. సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు రామదాసు, రాజు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సీపీఐ కార్యాలయం వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నాయకులు అనేక హామీలు గుప్పించారన్నారు. అయితే ఒక్క హామీని కూడా అమలు చేసిన పాపాన పోలేదన్నారు. సూపర్ సిక్స్ అని ఊదర గొట్టిన వారు ఏమైయ్యారని ప్రశ్నించారు. గుత్తి మున్సిపాలిటీలో వెయ్యి మంది పేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేసి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని రెవెన్యూ అధికారులకు వినతి పత్రాలు అందజేశామన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ ఓబులేసుకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీర భద్ర స్వామి, మహిళా సమాఖ్య నియోజకవర్గం కార్యదర్శి మహముదా, సీనియర్ నాయకులు రమేష్, డోలక్ షఫి, డేనియల్, మధు, మాబ్బీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారమే లక్ష్యం


మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్

గుంతకల్లు రూరల్: ఎస్సీ,ఎస్టీల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ కృషి చేయాలని ఆర్డీఓ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ డివిజనల్ స్థాయి మూడో సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా భారత్, పాకిస్తాన్ యుద్ధంలో వీరమరణం పొందిన మురళీనాయక్‌ను స్మరించుకుంటూ రెండు నిమిషాల పాటు మౌనం వహించారు. అనంతరం ఆర్డీఓ శ్రీనివాస్, డీఎల్‌డీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీల సమస్యల పరిష్కారంలో పోలీస్ శాఖ కీలక బాధ్యత తీసుకోవాలన్నారు.అధికారులు, కమిటీ సభ్యులు ఎస్సీ,ఎస్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టడంతోపాటు, వారి సంక్షేమానికి కృషి చేయాలన్నారు. కమిటీ సభ్యుడు హరిప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ కాగా 1972లో గుంతకల్లు మండలంలోని దంచర్ల గ్రామంలో దాదాపు 32 ఎస్సీ కుటుంబాలకు 66 ఎకరాల భూమిని జీవనాధారం కోసం అన్ రిజర్వుడ్ కింద కేటాయించారన్నారు. ఇటీవల అధికారులు రైతులు ఆ సాగు చేసుకోటానికి వీల్లేదని ఆంక్షలు విధించారన్నారు. 50 ఏళ్లుగా భూమిని సాగు చేసుకుంటూ జీవించిన రైతులు ఇప్పుడు రోడ్డున పడ్డారని, వారికి న్యాయం చేసి ఆదుకోవాలన్నారు. అలాగే నెలగొండ గ్రామానికి చెందిన ఎస్సీ రైతుకు పొలానికి రస్తా ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు డ్రాప్ అవుట్ కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. అన్యమత పద్ధతులను, అన్యమత దేవుళ్లను పూజిస్తూ ఎస్సీ,ఎస్టీలుగా చెలామణి అవుతూ లబ్ధిపొందుతున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

పరామర్శ


అనంతపురంలో చికిత్స పొందుతున్న మారుతిని పరామర్శిస్తున్న సంజీవరాయుడు, వెంకటరామిరెడ్డి, నాగేష్

యాడికి: టీడీపీ గుండాల దాడిలో గాయపడి అనంతపురంలో చికిత్స పొందుతున్న మండలంలోని బోయరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల జాయింట్ సెక్రటరీ మారుతీకుమార్‌ను మంగళవారం ఆ పార్టీ మండల కన్వీనర్ సంజీవరాయుడు పరామర్శించారు. గత రెండు రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన టీడీపీ గుండాలు దాడి చేయటంతో అనంతపురంలో మారుతి కుమార్ చికిత్స పొందుతున్నాడు. భయపడవద్దు వైఎస్సార్‌సీపీ పార్టీ అండగా ఉంటుందని మారుతికి భరోసా ఇచ్చారు. మారుతిని పరామర్శించిన వారిలో చందన వెంకటరామిరెడ్డి, రాయలచెరువు నాగేష్ ఉన్నారు.

నేడు ‘వెన్నుపోటు దినం’

కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో బుధవారం వెన్నుపోటు దినం నిర్వహించనున్నారు. తాడిపత్రి నియోజకవర్గానికి సంబంధించి యాడికిలో, గుంతకల్లు నియోజకవర్గానికి సంబంధించి గుంతకల్లులో, శింగనమల నియోజకవర్గానికి సంబంధించి నార్పలలో నిర్వహించే కార్యక్రమాలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు, రైతులు హాజరై విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తలు కేతిరెడ్డి పెద్దారెడ్డి, వై.వెంకటరామిరెడ్డి, సాకే శైలజానాథ్ పిలుపునిచ్చారు.

శింగనమల: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు చేపట్టిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం శింగనమల నియోజకవర్గంలోని నార్పలలో నియోజకవర్గ స్థాయిలో బుధవారం నిర్వహిస్తామని నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ తెలిపారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి గ్రామం నుంచి తరలిరావాలని ఆయన కోరారు.

పుట్లూరు: నార్పల మండలకేంద్రంలో బుధవారం చేపట్టే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని వైఎస్సార్‌సీపీ వలంటీర్స్ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఇల్లూరి జయరామిరెడ్డి కోరారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

గుంతకల్లుటౌన్: కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను ఎండగడుతూ గుంతకల్లులో బుధవారం వైఎస్సార్‌సీపీ నిర్వహించనున్న ‘వెన్నుపోటు దినం’ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి, పట్టణ, మండల అధ్యక్షులు ఖలీల్, రాము కోరారు. మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు పార్టీ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకూ భారీ బైక్ ర్యాలీ ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని మూడు మండలాలకు చెందిన పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని మంగళవారం వారు ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

పామిడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంతకల్లులో మాజీ ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి సారథ్యంలో బుధవారం నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమం జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పెమ్మక చెన్నకేశవరెడ్డి, పట్టణ, రూరల్, వైస్ కన్వీనర్లు నాగూరు ఈశ్వర్‌రెడ్డి, ఆర్.రామకృష్ణనాయక్, సల్లావుద్దీన్, నీలూరి హరినాథ్‌రెడ్డి మంగళవారం తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, వైఎస్ అభిమానులు, ప్రజలు పెద్దఎత్తున కదిలిరావాలని వారు కోరారు.

యాడికి: వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా బుధవారం నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమం విజయవంతం చేద్దామని ఆ పార్టీ మండల కన్వీనర్ సంజీవరాయుడు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఉదయం 9 గంటలకు హాజరై వెన్నుపోటు దినం కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. తాడిపత్రి నియోజక వర్గంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు యాడికి మండలంలోని పార్టీ కార్యాలయానికి రావాలన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దకే ‘రేషన్’


పుట్లూరు మండలం కొండుగారికుంటలో దివ్యాంగుడు శంకరయ్యకు ఇంటి వద్ద రేషన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

పామిడి/యాడికి/గుంతకల్లురూరల్/పుట్లూరు: 65 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దకే రేషన్ సరుకులు పంపిణీ చేయిస్తామని పామిడి తహసీల్దార్ ఎస్.శ్రీధరమూర్తి మంగళవారం తెలిపారు. సంబంధిత డీలరే వారి ఇంటికి వెళ్లి రేషన్ పంపిణీ చేస్తారన్నారు. అలాగే యాడికి మండలంలోని యాడికి, రాయలచెరువు గ్రామాల్లో వృద్ధులకు డీలర్లు అందిస్తున్న సరుకుల పంపిణీని తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, వీఆర్‌ఓలు తనిఖీ చేశారు. అదేవిధంగా గుంతకల్లులో తహసీల్దార్ రమాదేవి, డీటీ నారాయణ స్వామి, సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మి మాట్లాడుతూ ఇక నుంచి రేషన్ షాపుల్లోనే సరుకుల పంపిణీ ఉంటుందన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు డీలర్లు ఇంటివద్దకే రేషన్ పంపిణీ చేస్తారన్నారు. అలాగే పుట్లూరు మండలంలోని కొండుగారికుంట, కుమ్మనమల, ఎల్లుట్ల, మడుగుపల్లి, మడ్డిపల్లి, కొండుగారికుంట తదితర గ్రామాల్లో వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ కార్యక్రమాన్ని మంగళవారం మండల స్పెషల్ ఆఫీసర్ ఆంజనేయులు, తహసీల్దార్ శేషారెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు శ్రీనివాసులు, రేషన్‌షాపు డీలర్లు పాల్గొన్నారు. అలాగే పెద్దవడుగూరు మండలంలోని రేషన్ దుకాణాలను తహసీల్దార్ ఉషారాణి ఆకస్మిక తనిఖీ చేశారు. సరుకుల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులున్నా 8500292992కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి


కిశోరి వికాసం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: కిశోర బాలికల మనోవికాసం కోసం సచివాలయాలు, అంగన్‌వాడీ సెంటర్లలో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బాలల పరిరక్షణ సమితి అధికారిణి వెంకటేశ్వరి సూచించారు. మంగళవారం గుంతకల్లు పట్టణంలోని జగద్గురు మఠం అంగన్‌వాడీ సెంటర్‌లో కిశోర బాలికల నాయకత్వం, సాధికారత అంశాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 10 నుంచి నిర్వహించే శిక్షణ తరగతుల్లో కిశోర బాలికల మనో వికాసానికి సంబంధించిన అంశాలతోపాటు, ఆన్‌లైన్ ఫోన్ వాడకం, అనవసరమైన యాప్స్, లింక్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం వల్ల కలిగే అనర్థాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఆన్‌లైన్‌లో వేరే వ్యక్తులకు చెప్పడం వల్ల కలిగే అనర్థాలపై వివరిస్తామన్నారు. అలాగే విద్య ప్రాముఖ్యత, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు తదితర అంశాలపై నెలరోజుల పాటు జరిగే శిక్షణ తరగతులుంటాయన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం


రామగిరి ఎగువతండాలో ప్రచార దృశ్యం

పామిడి: మండలంలోని రామగిరి ఎగువతండాలో మంగళవారం త్రైత సిద్ధాంత–ప్రబోధ సేవాసమితి–ఇందుజ్ఞాన వేదిక గుంతకల్లు, నాగసముద్రం కమిటీల ఆధ్వర్యంలో భగవద్గీత ప్రచారం చేశారు. ఆ సమితి సభ్యులు మాట్లాడుతూ. దైవ జ్ఞానం ప్రకారం కులాలు అహేతుకమని, మతాలు నిషిద్ధమని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథం శ్రీకృష్ణుడి అసలైన జ్ఞానం తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆయా సమితి కమిటీల అధ్యక్షులు కృష్ణమూర్తి, ధనుంజయ, సభ్యులు దొనప్ప, త్రివేణి, లక్ష్మిదేవి, సర్వజ్ఞ వరలక్ష్మి, సాయి, మల్లీ, రాజేశ్వరి, చైతన్య, రాజు, రాధ, శ్రేయస్సు, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

గార్లదిన్నె: గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌ను మంగళవారం డీఎస్పీ వెంకటేశులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి, పాత కేసులపై ఆరా తీశారు. శాంతిభద్రలకు విఘాతం కలుగకుండా గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరుగకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు.

నూతన సాంకేతిక పద్ధతులతో అధిక దిగుబడి


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి ఉమా మహేశ్వరమ్మ

శింగనమల: రైతులు నూతన సాంకేతిక పద్ధతులను అవలంబించి, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఉమా మహేశ్వరమ్మ సూచించారు. మంగళవారం మండలంలోని సోదనపల్లి, శింగనమల గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు శిక్షణ నిచ్చారు. ఆమె మాట్లాడుతూ పంటలసాగు విధానంలో రైతులు నూతన మెలకువలు , పద్ధతులను పాటించాన్నారు. రైతులకు వేరుశనగ విత్తన పంపిణీ , ఎరువుల సరఫరా, రైతు విశిష్ట సంఖ్య నమోదు, భూసార పరీక్షలు గురించి వివరించారు. వేరుశనగలో ట్రైకోడెర్మ జీవన ఎరువుతో విత్తనశుద్ధి, వాటి ఉపయోగాల గురించి తెలిపారు. తెగుళ్లు, పురుగుల వల్ల నష్టం, వాటిని ఎలా నివారించాలో వివరించారు. కేవీకే కోఆర్డినేటర్ మల్లీశ్వరి మాట్లాడుతూ వరి సాగులో మెలకువలు, వరిలో రకాలు, కాలిబాటలు, కలుపుమందులు పిచికారి, భూసార పరీక్షలు వాటి ఉపయోగాలపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో రెడ్డిపల్లి ప్రిన్సిపల్ శాస్త్రవేత్త భార్గవి, రేకుల కుంట ఎఆర్ఎస్ సీనియర్ శాస్త్రవేత్త రాజన్న, శశికళ, రఘుకిరణ్, మండల వ్యవసాయాధికారి అన్వేషకుమార్, పశువైద్యాధికారి కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

తాడిపత్రిటౌన్: తాడిపత్రి రూరల్ పరిధిలోని వంగనూరు సమీపంలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.4,690 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు.


తాడిపత్రి టైలర్స్ కాలనీలో రేషన్ డిపో వద్ద వేచి ఉన్న కార్డుదారులు

రేషన్ కోసం తప్పని పాట్లు

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణంలోని టైలర్స్ కాలనీలో రేషన్ బియ్యం కోసం కాలనీ వాసులకు పాట్లు తప్పడం లేదు. కాలనీవాసులు ఉదయం నుంచి సాయంత్రం వరకు రేషన్ దుకాణాల వద్ద వేచి ఉండి సరుకులు తీసుకుని వెళ్తున్నారు. పనులు మానుకుని రేషన్ డిపో వద్ద పడికాపులు కావాల్సి వస్తోందని కొంత మంది కాలనీ వాసులు వాపోయారు. గత ప్రభుత్వంలో ఇంటి వద్దకే రేషన్ బియ్యం వచ్చేదని, ఈ అవస్థలు లేకుండా ఉండేవని గుర్తు చేసుకుంటున్నారు. కొంతమంది మహిళలు ఎండకు క్యూలో నిలబడలేక సంచులను వరుసగా ఉంచారు. రెక్కడితే గాని డొక్కాడని కొంత మంది కూలి పనులు మానుకొని రోజంతా రేషన్ సరుకుల కోసం వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.